అమ్మవారి వేడుకల్లో ఉత్సవ కమిటీ బాధ్యులు, భక్తులు

దుర్గామాత ఉత్సవాలు షురూ..

జనగామ, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట శ్రీవిజయ దుర్గామాత ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా తొలిరోజు ఎల్లమ్మ కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తుల జయజయ ధ్వానాల నడుమ మేళతాళాలతో పూజారులు ఎల్లమ్మ కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కాగా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తొలిరోజు వేడుకలో పాల్గొని పూజలు చేశారు. ఏసీపీ పార్థ సారథి ఆలయ ఆవరణలో బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు పిట్టల సత్యం, స్థానిక కౌన్సిలర్ వాంకుడోత్ అనిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కుమారస్వామి

జఫర్‌గఢ్, అక్టోబర్ 15 : బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా కొత్వాల కుమారస్వామిని నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నియమించినట్లు పేర్కొన్నారు. జఫర్‌గఢ్‌కు చెందిన కొత్వాల కుమారస్వామి పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధనలో మండలంలో ముఖ్య భూమిక పోషించారని రాజయ్య తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కుమారస్వామి సేవలను నియోజకవర్గ స్థాయిలో వినియోగించుకునేందుకు బీసీ సెల్ కోఆర్డినేటర్ గా నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు కేటాయించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని ఆయన వివరించారు.

రేపు జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : జనగామ పట్టణంలోని ప్రెస్టన్ స్కూల్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం 9 గంటలకు వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం భగత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడలపై ఆసక్తితో పాటు 1 జనవరి 2010 తర్వాత జన్మించిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. దించాలని సూచించారు.

IN THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM- PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE JANGAON

I.A. NO. 100 OF 2024
IN I.A. NO. 101 OF 2024
IN I.A.O. 102 OF 2024
IN M.V.O.P. No. 255 OF 2022

BETWEEN:
Mandapuram Rithish, Minor Rep. by Mandapuram Raju ...Petitioner/Petitioner
AND
1. Pundra Raji Reddy (Died Per LR's)
2. Pundra Thirupathi ...Respondents/Respondents
3. Pundra Laxmi
4. Pundra Rajamma
5. Pundra Venkata Laxmi
6. Pundra Renuka ...Proposed Respondents

PAPER PUBLICATION

To,
1. Pundra Rajamma, D/o Late. Raji Reddy, Aged about: 50 years, Occu: House - Wife,
2 Pundra Venkata Laxmi, D/o Late. Raji Reddy, Aged about: 45 years, Occu: House - Wife,
3. Pundra Renuka, D/o Late. Rajl Reddy, Aged about: 50 years, Occu: House - Wife,
All are R/o C/o Pundra Laxmi, W/o Late. Raji Reddy, H. No. 3-46, Vishwanatha Puram Village of Ghanpur (Stn) Mandal of Jangaon District ...
...Proposed Respondents No. 4, 5 & 6

Please take notice in the above case, the above named Petitioner/Petitioner has filed the above O.P. for the compensation in a road accident case against Raji Reddy and Thirupathi after filing the above OP the Raji Reddy was died as such his wife and daughters i.e., Pundra Laxmi, Pundra Rajamma, Pundra Venkata Laxmi and Pundra Renuka brought on record the Pundra Laxmi engaged an advocate. The above O.P. Is posted to 05-11-2024 for the appearance of Pundra Rajamma, Pundra Venkata Laxmi and Pundra Renuka i.e., Proposed Respondents No. 4, 5 & 6 before the above sald court In person or along with an advocate or otherwise in your absence the above I.A's & main O.P. will be decided Exparte, and proceed as per law.

//By Order of the Honorable Court//
Sd/- **PENDYALA MAHEEDHAR RAO**
Advocate for Petitioner
Jangaon Town & District. Cell No. 9849143799

కళాజాతరకు భుజేందర్‌కు ఆహ్వానం

భుజేందర్

పాలకుర్తి, అక్టోబర్15: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల19న ఆంధ్ర ప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో జరిగే సాహిత్య కళాజాతరకు మండలంలోని బమ్మెరకు చెందిన పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్‌కు ఆహ్వానం అందింది. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాజాతరకు ఆహ్వానం అందడం సంతోషకరమన్నారు. శ్రీశ్రీకళావేదిక ఎందరో కవులను ప్రోత్సహిస్తూ ముందుకెళ్తున్నదని ఆయన పేర్కొన్నారు.

జనగామ డిపోకు రూ.2.29 కోట్ల ఆదాయం

- బతుకమ్మ, దసరాకు ఆర్టీసీకి కలెక్షన్ ఫుల్
- జనగామ డిపో పరిధిలో పెరిగిన ప్రయాణికుల రద్దీ

ఉత్తమ సేవలందించిన డ్రైవర్లను సన్మానిస్తున్న డిపో మేనేజర్ స్వాతి

జనగామ, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : సద్దుల బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ జనగామ డిపోకు ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు రూ.2.29 కోట్లు (టికెట్ కలెక్షన్) ఆదాయం సమకూరింది. హనుమకొండ, జగద్గిరిగుట్ట, ఉప్పల్, సిద్ధిపేట, సూర్యాపేట, నర్మెట, హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపించారు. వారి అంచనాలకు మించి టికెట్ కలెక్షన్ పెరిగింది. పండుగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలు తిరుగుపయనమయ్యాయి. తొమ్మిది రోజుల్లో 115 బస్సు సర్వీసులు 4,28,258 కిలోమీటర్లు ప్రయాణించాయి. 4,78,951 మంది ప్రయాణికుల ద్వారా రూ.2.29,21,884 ఆదాయం సమకూరిందని జనగామ డిపో మేనేజర్ ఎస్ స్వాతి తెలిపారు. తొమ్మిదిరోజుల్లో డిపోలోని అన్ని బస్సులు సాధారణంగా తిప్పాల్సిన దానికంటే అదనంగా 18,560 కిలోమీటర్లు నడిచాయి. అంటే సగటున రోజువారి 53,216 మంది ప్రయాణికులు(అదనంగా రోజుకు 3216 మంది) ప్రయాణించారు. దీంతో ఆక్యుపెన్సీ రేషియా సగటున 91 సాధించగా, ఈనెల 14న అదనంగా 74 ట్రిప్పులు నడిపి 32,93,350 రూపాయల ఆదాయం సాధించి ఆక్యుపెన్సీ రేషియ 124 సాధించింది. ఒక్కరోజునే 58,249 మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చామని, ఉచిత బస్సు సౌకర్యం వల్ల పండుగ సీజన్‌లో మహిళా ప్రయాణికులు రోజు 65 శాతం మంది ప్రయాణించారని డిపో మేనేజర్ స్వాతి వివరించారు.

రేపు వాల్మికి జయంతి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాల్మికి జయంతి వేడుకలకు వివిధ శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ చెల్లించాలని ఆందోళన

నిరసన తెలుపుతున్నకళాశాలల నిర్వాహకులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీఎంఏ) ప్రతినిధులు, అధ్యాపకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. టీపీడీఎంఏ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో అధ్యాపకులకు వేతనాలు, బిల్డింగ్‌లకు అద్దె చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు డిగ్రీ కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీడీఎంఏ జిల్లా ప్రతినిధులు జీ నర్సయ్య, కే రాజిరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

కూనూరులో అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న పర్వేజ్

దేవరుప్పుల, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి, ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ భాస్కర్ నేతృత్వంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ గణేశ్ మాట్లాడుతూ కలాం జీవితం తెరిచిన పుస్తకమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి చదువులో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య, అనురాధ, వెంకటేశ్వర్లు, శశిధర్, ఉదయ్‌కుమార్, భవానీ, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు

దేవరుప్పులలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కర్

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మండలంలోని కూనూరు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం లోని కలాం విగ్రహానికి ఎంఈవో ఎండీ పర్వేజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అని యువతకు గొప్ప సందేశాన్నిచ్చిన మహనీయుడని ఆయన పేర్కొన్నారు.

'పెటా' జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రవీణ్ కుమార్

నరేందర్‌గౌడ్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (పెటా) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీని మంగళవారం ధర్మకంచ జడ్పీ హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ ప్రవీణ్‌కుమార్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) జడ్పీహెచ్‌ఎస్ చిన్నమడూరు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పీ నరేందర్‌గౌడ్, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) జడ్పీహెచ్‌ఎస్ ధర్మకంచ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం నూతన కమిటీ బాధ్యులను పలువురు పీడీలు, పీఈటీలు కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు.

వ్యాధి నివారణకు టీకాలు

నర్మెట, అక్టోబర్ 15: పశువైద్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఇప్పలగడ్డలో మంగళవారం సుమారు 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను మండల పశువైద్యాధికారి నేహా తెలిపారు. రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవో సుభద్ర, సిబ్బంది శివనాగరాజు, అనిల్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు ఇస్తున్న వైద్యాధికారి నేహా

ఉపాధి హామీ పనుల రికార్డులు పక్కాగా ఉండాలి

అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్

పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న చంద్రశేఖర్

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : ఈ నెల చివరి నాటికి ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై కేంద్ర బృందం పరిశీలించనుందని అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని తాటికొండ గ్రామ పంచాయతీలో ఆవరణలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధిహామీ సిబ్బందికి ఉపాధి హామీ పనుల రికార్డుల నిర్వహణపై ఆయన అవగాహన కల్పించారు. సెంట్రల్ టీమ్, నేషనల్ మానిటరింగ్ టీమ్ ఈ నెలాఖరులోగా పర్యటిస్తుందన్నారు. తాటికొండ, చాగల్, నమిలిగొండ, పాం నూర్, అక్కపల్లిగూడెంలో జరిగిన ఉపాధిహామీ పనులను, చేసిన పనుల రిజిస్టర్లలో నమోదును పరిశీలించిన చంద్రశేఖర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ వీరన్న, ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, ఏపీవో ప్రేమయ్య, ఈసీ కిరణ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ సునీత, స్వరూప, పంచాయతీ కార్యదర్శులు జేసుమని, నర్మద, నరేశ్, అవినాష్, సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, యాదగిరి, అమీనా, మాధురి, కవిత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు దిగుబడులు వ్యవసాయ మార్కెట్‌కు వచ్చేలా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగల రమేశ్ కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన జూలుకుంట్ల లావణ్యా శిరీష్ రెడ్డి దంపతులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ కాంటాలు కొనసాగకుండా మార్కెట్ కమిటీ చూడాలని కోరారు. రైతులు పండించిన పంటలు మార్కెట్‌కు వచ్చేలా చూసి, గిట్టుబాట ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పగూడెం కార్యదర్శి గట్ల మల్లారెడ్డి, రంగరాయగూడెం గ్రామ సహాయ కార్యదర్శి ములుకుంట్ల రాజు, పాలాసు రమేశ్, ఐలయ్య, ఎల్ రాజు, పొలాసు సాంబయ్య, కొమురయ్య, గంగయ్య, నరేష్, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ చేస్తున్న ఎంఈవో నర్సయ్య

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

పాలకుర్తి, అక్టోబర్15: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఈవో పోతుగంటి నర్సయ్య, సంస్థ చైర్మన్ మొలుగూరి యాకయ్యాగౌడ్ గొడుగులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు రమేశ్, బలరాం, సోమయ్య, తమ్మి మధు, శోభ, రవి, సోమ్మల్లు పాల్గొన్నారు.

బుగులు వేంకటేశ్వరుడికి 108 బంగారు పద్మాలతో పూజలు

స్వామివారిని దర్శించుకుటున్న భక్తులు

చిల్పూరు, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామివారికి మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజలు చేశారు. తిరుపతిలో నిర్వహించినట్లుగా 108 బంగారు పుష్పాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎస్ మోహన్‌బాబు మాట్లాడుతూ అష్టాదశ పాద పద్మారాధన పూజలను ప్రతి మంగళవారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతులు, మాజీ దేవస్థాన డైరెక్టర్ సంగోజు మోహన్‌చారి–శంకరలక్ష్మీ దంపతులు, ప్రధాన అర్చకులు బ్రాహ్మనపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

197 మంది నూతన ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్స్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో పాఠశాలల కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 197 మంది ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్స్‌ను అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డీఈవో రాముతో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఉపాధ్యాయుడు కృతనిశ్చయంతో పనిచేయాలని సూచించారు. కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి సహకరించిన వారికి డీఈవో కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల, అక్టోబర్ 15: మండలంలోని పెదమడూరుకు చెందిన ఆదర్శ యూత్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారుపోతుల సందీప్, ఉపాధ్యక్షుడిగా సంగి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి నాగరాజు, క్రీడా కన్వీనర్‌గా ఆకవరం రాజు, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా కర్రె అశోక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చంద్రగిరి సంపత్, సభ్యులు ముత్యాల నరేశ్, పెదగోని రాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ, పోలీసు అధికారుల చెక్


వాగులో ట్రెంచ్ ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై

జఫర్‌గఢ్, అక్టోబర్ 15 : మండలంలోని తిడుగు శివారు ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరుగకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం చర్యలు తీసుకున్నారు. ఆకేరు వాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక రవాణ జరుగుతుండగా ఇటీవల ఎస్సై రామ్‌చరణ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో తిడుగు రైతులు ఇసుక రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎస్సై రామ్‌చరణ్ ఆకేరు వాగులోకి ట్రాక్టర్లు రాకుండా చర్యలు చేపట్టి రెండు వైపులా జేసీబీతో ట్రెంచ్(కాల్వ లు) తీయించారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు. ఇసుక రవాణాను అరికట్టేందుకు ఎస్సై చర్యలు తీసుకోవడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ ఖాసీం నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈగా రాంబాబు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : విద్యుత్ శాఖ స్టేషన్ ఘన్‌పూర్ డీఈగా వై రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కార్పొరేట్ జిల్లా కార్యాలయంలో మెటీరియల్ మేనేజ్‌మెంట్‌లో ఆయన విధులు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో రాంబాబును విద్యుత్ శాఖ డీఈ గడ్డం గణేశ్, ఏడీలు వంశీ, తిలక్, డీఈ స్వామ్యానాయక్, భువనేశ్వరి, ఏఈలు, వివిధ సంఘాల బాధ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజరాజేశ్వరీ ఆలయాన్ని దర్శించుకున్న ఎర్రబెల్లి

పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

కొడకండ్ల, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని రాజ రాజేశ్వరీ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము, సొసైటీ వైస్ చైర్మన్ మేటి సోమరాములు, బీఆర్‌ఎస్ నాయకులు మసురం వెంకటనారాయణ, భూక్యా మంగ్యానాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి వాటర్‌మెన్లకు శిక్షణ

దేవరుప్పుల, అక్టోబర్ 15: గ్రామపంచాయతీల్లో మంచినీటి సరఫరా పనులు పర్యవేక్షిస్తున్న వాటర్‌మెన్లకు బుధవారం నుంచి నాలుగు రోజులు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మిషన్ భగీరథ ఏఈ మానస తెలిపారు. మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. ప్రతి గ్రామపంచాయతీ నుంచి నీటి నిర్వహణ చేపడుతున్న జీపీ కార్మికులు విధిగా శిక్షణ శిబిరానికి హాజరు కావాలని ఆమె కోరారు.

ఏఈ రాజవర్ధన్‌రెడ్డికి సన్మానం

దేవరుప్పుల, అక్టోబర్ 15: మండలంలోని సింగరాజుపల్లి సెక్టర్‌లో విధులు నిర్వర్తించిన ఏఈ రాజవర్ధన్‌రెడ్డి జిల్లా కేంద్రానికి బదిలీ అయిన సందర్భంగా ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌దాస్ మల్లేశ్ నేతృత్వంలో సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లు సేవలందించిన రాజవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోముల వీరన్న, ఇప్ప రాజు పాల్గొన్నారు.

నేడు జనగామకు చేరుకోనున్న సీఎం కప్ ర్యాలీ

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 క్రీడా జ్యోతి ర్యాలీ హనుమకొండ నుంచి బుధవారం జనగామకు చేరుకుంటుందని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి బీ వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు యశ్వంతాపూర్ ఎల్లమ్మ గుడి దగ్గర నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు ఆదిత్య

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : మండలంలోని పాంనూర్‌కు చెందిన పొన్న వేణు, కోమలత దంపతుల కుమారుడు పొన్న ఆదిత్య అండర్–14లో ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆదిత్య ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించి, ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. వచ్చే నెల 7 నుంచి 10 వరకు గోవా రాష్ట్రంలోని మపూసా పట్టణంలో జరిగే ప్రపంచ కరాటే పోటీలకు ఆదిత్య వెళ్తాడని వారు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ల నియామకం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పలు గ్రామాలకు పార్టీ కోఆర్డినేటర్లను నియమించారు. బీసీ సెల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా కుంభం కుమార్, ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్‌గా గుర్రం శ్రీనివాస్ తోపాటు వివిధ గ్రామాలకు కోఆర్డినేటర్లను నియమించారని పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ తెలిపారు.

రాఘవాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : మండలంలోని రాఘవాపూర్‌లో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ దశరథం మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో సీడీఎఫ్ నిధులతో 125 మీటర్ల సీసీ రోడ్డును రూ.5 లక్షలతో నిర్మించారు. ఈ కార్యక్రమంలో కాసాని మల్లయ్య, కందుల శ్రీను, బొడ్డు రాజు, సాగర్, మేకల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సతో ఐదు కిలోల కణితి తొలగింపు

కణితిని చూపుతున్న డాక్టర్ రాజమౌళి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 15 : ఓ మహిళా పేషెంట్ కడుపులో నుంచి 5.10 కిలోల కణితిని శస్త్ర చికిత్స ద్వారా డాక్టర్లు తొలగించిన ఘటన జనగామలో జరిగింది. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీహెచ్ రాజమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలం మొండ్రాయికి చెందిన ఇటుకల తబిత(47) అనారోగ్యంతో వైద్యచికిత్స కోసం తమ నర్సింగ్ హోమ్‌కు వచ్చిందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమె కడుపులో పెద్ద ఆకారంలో ఉన్న కణితిని గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం శస్త్ర చికిత్స నిర్వహించి 5.10 కేజీల కణితిని తొలగించినట్లు రాజమౌళి పేర్కొన్నారు. ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. శస్త్రచికిత్సలో అనస్తీషియా డాక్టర్ రఘు, థియేటర్ అసిస్టెంట్లు మోర్తాల ప్రభాకర్, అలిసెరి శ్రీనివాస్, అల్వాల రమేశ్, కుంట మల్లేశ్, సిస్టర్ సరోజన పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని తిరుమలనాథ స్వామి కాలనీ 5వ వార్డుకు చెందిన కుంభం భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ వార్డు సభ్యుడు కొలిపాక వేణు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో కుంభం నరేందర్, కుంభం రాజు, కుమార్, మధు, కొలిపాక సతీశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులాపూర్‌లో శతాధిక వృద్ధురాలు మృతి

జఫర్‌గఢ్, అక్టోబర్ 15 : మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన కందిక భద్రమ్మ(110) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. మాజీ ఎంపీటీసీ లు దేవదాస్, కుమార స్వామి, నాయకులు అనిల్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నర్మెట, అక్టోబర్ 15: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అమ్మాపురం శివారు పిట్టలోనిగూడెంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై నైనాల నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మాపురం గ్రామం పిట్టలోనిగూడేనికి చెందిన గుజరాతి లక్ష్మయ్య(20) బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. ఆమె పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు బాధితుడిని జనగామలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

మల్కాపూర్‌లో బాలికపై కుక్కల దాడి

చిల్పూర్, అక్టోబర్ 15 : మండలంలోని మల్కాపూర్‌లో వీధి కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాహుల్ మల్కాపూర్‌లో పానిపూరి బండితో ఉపాధి పొందుతు న్నాడు. మంగళవారం అతడి కూతురు ఫలక్ ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేయడంతో గాయపడింది. బాధితురాలిని చికిత్స కోసం దవాఖానలో చేర్చారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

తరిగొప్పుల, అక్టోబర్15: పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌లో రైతు కొమ్మరాజుల సాంబరాజుకు చెందిన పాడి గేదెను సోమవారం సాయంత్రం ఇంటి ఆవరణలో కట్టేశారు. రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి పిడుగుపడింది. దీంతో పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

★PHARMACY BOYS (మందుల షాపు), OT BOYS (ఆపరేషన్ థియేటర్), SUPERVISIORS (Administrators) & LAB TECHNICIANS కావలెను. సంప్ర : గార్డియన్ హాస్పిటల్, వరంగల్. 2 to 4 PM.
NTW-0436

CHANGE OF NAME
I, ABDUL MASOOD S/o ABDUL HUSSAIN Residing at H.No. 15-2-368/1, Rangampet, Hanumakonda, Warangal declare that Changed my name from ABDUL MASOOD to ABDUL MASOOD MOHD.

LOST OF PASSPORT
★I MOHAMMED AMEENUDDIN S/o MOHAMMED MOINUDDIN, I have lost my PASSPORT No. A4762484, while shifting my house from Reddy colony to Kumarpally on 14-06-2024 if any one see my passport please inform R/o. H.No. 4-4-58, Kumarpally, hanamkonda, 506001.,Telangana.
NTW-000

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565